

సద్దుల బతుకమ్మ సంబురాలు

జగిత్యాలరూరల్/ జగిత్యాల టౌన్/సారంగాపూర్/కొండగట్టు/మల్యాల/పెగడపల్లి/రాయికల్/ధర్మపురి/గొల్లపల్లి: సద్దుల బతుకమ్మ సంబరాలు జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆటపాటలు ఆడుతూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసి వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు.


కోరుట్లలో బతుకమ్మ సంబురాల్లో బాలికలు


సారంగాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


పెగడపల్లిలో..


ధర్మపురిలో బతుకమ్మలతో మహిళలు


భీంరాజ్‌పల్లిలో బతుకమ్మ ఆడుతున్న యువతులు


రాయికల్‌లో బతుకమ్మలతో మహిళలు

సూరమ్మ ప్రాజెక్టు పనుల జాప్యంపై కాంగ్రెస్ నిరసన

కథలాపూర్: కథలాపూర్, మేడిపెల్లి, బీమారం మండలాలకు సాగునీరందించే సూరమ్మ ప్రాజెక్టు పనుల జాప్యంపై కథలాపూర్‌లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహం ఎదుట మూతికి నల్లగుడ్డలు కట్టుకుని ప్రభుత్వం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. సూరమ్మ ప్రాజెక్టు పనులకు భూమిపూజ చేసి ఐదేళ్లు గడిచినా తట్టెడు మట్టి తీయలేదని, ప్రాజెక్టులపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాయితి నాగరాజు, ఎం.డీ అజీమ్, గడ్డం స్వామిరెడ్డి, కల్లెడ గంగాధర్, కట్ట శంకర్, ఆకుల సంతోష్, తలారి మోహన్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

జగిత్యాలటౌన్/ కోరుట్ల/రాయికల్/సారంగాపూర్/ ఇబ్రహీంపట్నం: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా భక్తమార్కండేయ ఆలయంలో 8వ రోజు ఆదివారం అమ్మవారు మహాగౌరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కోరుట్ల పట్టణంలోని పలు దుర్గామాత మండపాల్లో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు-సరోజన దంపతులు ఆదివారం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారిని ఆదివారం దుర్గా దేవి గా అలంకరించి ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదానాలు చేశారు. సారంగాపూర్ సారంగాపూర్,బీర్‌పూర్ మండలాల్లో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి మండపాల్లో అమ్మ భక్తులకు కాళికాదేవి రూపంలో దర్శనమిచ్చారు.


ఒడ్డెలింగాపూర్‌లో హోమం కాల్చుతున్న భక్తులు

ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవీలను గ్రామంలో వీధులగుండా ఊరేగించి అనంతరం మహిషాసురమర్ధన చేసి దుర్గామాతలను నిమజ్జనం చేశారు.

నృసింహునికి పొన్నచెట్టు సేవ

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి స్వామివారికి అర్చకులు పొన్నచెట్టు సేవ చేశారు. మామిడి ఆకులతో, మండలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి పల్లకిలో ఊరేగించారు. ఆలయ చైర్మన్ నేరెల్ల సుమన్ గౌడ్, మల్లేశం, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అర్వింద్‌కు టికెట్ కేటాయింపుపై బీజేపీ సంబురాలు


మెట్‌పల్లిలో సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు

మెట్‌పల్లి/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్: కోరుట్ల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్ ధర్మపురి అర్వింద్‌కు కేటాయించడంపై మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్‌లో ఆదివారం బీజేపీ నాయకులు బాణా సంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. అర్వింద్ భారీ మెజార్టీతో గెలిచేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చెట్లపల్లి సుఖేందర్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్, నాయకులు పాల్గొన్నారు. బీజేపీ మండలాల అధ్యక్షులు జకరయ్య, ముద్దం సత్యనారాయణగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



రాయికల్: మండలంలోని ఇటిక్యాల జిల్లా పరిషత్ పాఠశాలలో 2004-05 పదో తరగతి విద్యార్థులంతా కలిసి ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 18 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు అంతా కలిసి చదువుకునే రోజుల్లో పాఠశాలలో చేసిన అల్లర్లు గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులను సన్మానించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రానికి చెందిన గంగారపు గోపి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆదివారం గోపి కుటుంబ సభ్యులకు వారి చిన్ననాటి స్నేహితులు రూ.40 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో స్నేహితులు పాల్గొన్నారు.

అవయవదానానికి ఒప్పుకున్న వారికి సన్మానం

ఇబ్రహీంపట్నం: మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన మార్గం గంగు, పెద్దగంటి మౌనిక, పెద్దగంటి జమున, కొట లాస్య అవయవదానానికి ముందుకు రాగా, ఆదివారం వారిని ఇబ్రహీంపట్నం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నోముల రంజిత్ రెడ్డి సన్మానించి, అభినందిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అవయవ దానానికి ముందుకు రావడం గొప్ప నిర్ణయమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సతీష్‌యాదవ్, రాజేటుని రజినీకాంత్, మారుపాక రమేష్, అక్కపెల్లి జలేందర్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక ధృడత్వం

ఇబ్రహీంపట్నం: క్రీడలతో శారీరక ధృఢత్వంతో పాటు, స్నేహభావం పెరుగుతుందని నిర్మల్ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుడ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని వేములకుర్తిలో సున్నం మల్లమ్మ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు నగదు బహుమతిలను అందచేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సున్నం నవ్యశ్రీ, యామాపూర్ సింగిల్‌విండో చైర్మన్ అంకతి రాజన్న, అందుగుల నాగేశ్, నాయకులు పాల్గొన్నారు.

తాడిచెట్లు ధ్వంసం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

మేడిపల్లి: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన మరిపెల్లి రవిగౌడ్ అనే కల్లు గీత కార్మికునికి చెందిన తాటిచెట్లను ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై రవిగౌడ్‌కు కుల సంఘం దృష్టికి తీసుకెళ్లగా, జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి చంద్రశేఖర్‌గౌడ్ కు సమాచారం అందించారు. చెట్లు ధ్వంసం చేసిన దుండగుల పై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం ముడుపు

ధర్మపురి: రానున్న ఎన్నికల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్ మరోసారి భారీ మెజారిటీతో గెలుపొందాలని కోరుతూ ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ముడుపు కట్టారు. మండలంలోని దొంతాపూర్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ర్యాగల నారాయణ ఆధ్వర్యంలో దొంతాపూర్, ఆరెపెల్లి, మగ్గిడి, రాజారం, దమ్మన్నపేట గ్రామాల సర్పంచులు ఈశ్వర్ గెలుపొందాలని కోరుతూ గ్రామాల నుంచి తరలివెళ్లి ముడుపు కట్టారు. కార్యక్రమంలో గ్రామాలకు చెందిన మహిళలు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.













రాహుల్‌ను విమర్శించే స్థాయి కవితకు లేదు

కోరుట్ల: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని జువ్వాడి భవన్‌లో ఆదివారం మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన గాంధీ కుటుంబంపై కవిత చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్నారు. తెలంగాణలో 1200 మంది ఆత్మ బలిదానాలకు కల్వకుంట్ల కుటుంబమే కారణమన్నారు.కార్యక్రమంలో మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కృష్ణారావు



నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలి

మల్లాపూర్: మండలంలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని జువ్వాడి కృష్ణారావు కోరారు. మండలంలోని రాఘవపేట నుంచి కాంగ్రెస్ శ్రేణులు, చెరుకురైతులు, మహిళలతో కలిసి నిజాం షుగర్ ఫ్యాక్టరీ వరకు పాదయాత్ర చేపట్టారు. పండించిన చెరుకును కామారెడ్డికి తరలించేందుకు రైతులు ఇబ్బంది పడ్డారని, 10 నుంచి 20 రోజులు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు.

రేపు సాయి 105వ పుణ్య తిథి వేడుకలు

కోరుట్ల: పట్టణ శివారులోని సాయి బాబా ఆలయంలో మంగళవారం సాయి పుణ్యతిథి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, భక్తులకు అన్న ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు.

